# అపరాధం

దేవుడుంటే అతను మనకు తండ్రిలాటివాడయ్యుండాలి. తండ్రి తనని అగౌరపర్చాడని బిడ్డనుశపిస్తాడా? దేవుడిని ఎందుకలా క్రూరంగా చిత్రించి, మనకి మనం స్వయం శాపాలు విధించుకుంటున్నట్టు మనం?

—జయప్రద

"మేడమ్" వార్డ్ నర్స్ ముఖంలో ఆందోళన... భయం.

ఎందరో క్రొత్త ప్రాణి తల్లి గర్భంలోనుండి బయట పడనని మొండికేస్తే ఆపరేషన్ చేసి ఈ ప్రపంచంలో కొదలి పొట్ట పొరలు కుట్టడం పూర్తిచేసి గ్లౌస్ తీసి చేతులు కడుక్కుంటున్న నేను ఏమి టన్నట్లు తలెత్తి చూసాను.

"ఎమెర్జెన్సీ బెడ్‌లో పేషెంట్...."

నర్స్ వాక్యం పూర్తి చేయలేదింకా నా కనుపాపల చలనం క్షణం ఆగింది.

"ఆ పేషెంట్ కనబడ్డంలేదు" నా కనుబొమ్మలు ముడుచుకున్నాయి.

"కనబడ్డంలేదా? నువ్వేమయ్యావు?"

"ఏడో నెంబర్ గది పేసెంటు వాంతి చేసుకుందని వాళ్ళవాళ్ళు చెప్తే మేడమీద కెళ్ళాను. వచ్చే లోపలే మేడమ్! ఐదు నిముషాలే...."

నేను మరి మాట్లాడలేదు. వార్డు నర్స్ తప్పుకూడాలేదు. మిగతా నర్సులంతా థియేటర్‌లో వున్నారు. ఆమె ఒక్కటే చూసుకోవాలి. ఎవరు మాత్రం ఎవరిని ఎంతకాలమని కాపాడగలరు?

ఎమర్జెన్సీ బెడ్ ఖాళీ అక్కడక్కడా ఎర్రటి మరకలతో, తెల్లగా విశ్రాంతిగా వుంది.

"వాకిట్లో వున్నారేమో!" తలెత్తింది నర్స్.

నేను తలెత్తాను.

నాకంటే ఎత్తుగా వున్న సెలైన్ స్టాండ్‌కు అటు ఎర్రటి చిక్కటి రక్తం వున్న సీసా, ఇటు నార్ అడ్రినలిన్ మందు కలిపిన తెల్లటి ద్రవమున్న సీసా.

కళ్ళు క్రిందకు వాల్చాను.

బొట్లు బొట్లుగా ఎర్రటి తెల్లటి ద్రవాలు నేలమీద పరచుకుంటూ, భూమాతను తడిచేస్తున్నాయి.

"లేరమ్మా వెళ్ళిపోయారు"

అయిదు నిముషాల కాలంలో ముందు వేసుకున్న పథకంలా వుంది.

పకడ్బందీగానే వెళ్ళినట్లున్నారు.

ప్రొద్దున అడిగారు. బెరుకు బెరుకుగా వచ్చి నిల్చుని 'అమ్మా!

ఒక్కసారి మా శాంతను కామాక్షమ్మ దగ్గరకు కారులో తీసుకెళ్ళి గంటలో తిరిగొస్తాం'

కుళాయి తిప్పినట్లు రక్తం కారిపోతోందని దిక్కుతోచక జొన్న కాడ వెళ్ళకుండా ఇటొచ్చేశాం.

ఇంకా పిల్లది కోలుకోలేదు.

అమ్మదగ్గర కెళ్ళకుండా ఏ పనీ చేసే అలవాటులేదు మాకు. అమ్మకు కోపం వచ్చినట్లుంది"

నా గుండెల్లో విభ్రాంతి.

"వీళ్ళ గుండెల్లో చిత్రించుకున్న దేవత చిత్ర వాళ్ళ ఊహల్లో ఇంత దయలేనిదా?"

నిజానికి వాళ్ళ అమాయకత్వాన్ని ఆధారం చేసుకుని నేను "సరే"నని ఆ పేషెంట్‌ను పంపి హాయిగా విశ్రాంతి తీసుకోవచ్చు. కానీ నా మనసంగీకరించలేదు.

"ఊహు ఇపుడిపుడు నాడి అందుతోంది. రక్తపోటు ఇంకా స్థిరముగా పెరగలేదు. ఇప్పుడే తీసుకెళితే చచ్చిపోతుంది. బాగయ్యాక పంపిస్తాను. వెళ్ళివద్దురుగాని" అన్నాను.

అప్పటికీ వాళ్ళేం మాట్లాడలేదు.

వాళ్ళ గుండెల్లో ఎంత బలమైన నమ్మకమో?

సెలైన్ సీసాలమీద సీసాలు ఆమె శరీరంలో ప్రవహించడం వాళ్ళు చూస్తూనే వున్నారు.

మేము ఆ పేషెంట్ చుట్టూచేరి విశ్రాంతి లేకుండా నాలుగ్గంటల నుండి శ్రమపడుతున్నదీ చూస్తూనే వున్నారు.

వాళ్ళు తెచ్చే మందులకీ, మేమిచ్చే ఇంజక్షన్‌లకీ అంతులేకుండానే వుంది.

నేనింకా పేషెంట్ బ్రతుకుతుందనే గ్యారంటీ ఇవ్వలేదు.

అయినా తన ప్రియమైన కూతుర్ని బలవంతంగా ఇన్ని మందుల మీద నమ్మకాన్ని తెంచుకొని తీసుకుని వెళ్ళిపోయారంటే....వాళ్ళ గుండెల్లో దేవతపట్ల ఎంత నమ్మకం?

"ఇంకో గంటలో తీసుకొస్తారేమోనమ్మా" నర్స్ అంది.

నేను నవ్వాను చాలా విరక్తిగా, చాలా దిగులుగా.

బిడ్డ వచ్చేదారిలో ఓ ప్రక్కగా మాయ తను వుండకూడని స్థలములో వుండటంవల్ల నెప్పులతోపాటు విపరీతమైన రక్తస్రావమై నాడి అందని స్థితిలో తీసుకురాబడ్డ శాంత ఆమె అదృష్టంకొద్ది ఆపాటికే పూర్తిగా, ద్వారం ఏర్పడ్డంవల్ల, ఏడవనెల బిడ్డ పీలగా వుండడంవల్ల కాన్పు మామూలుగానే అయినా, కాన్పయ్యాక కూడా రక్తస్రావమయ్యి ఇరవయ్ నాలుగు గంటలుగా ఇన్ని మందులు, ఇన్ని రక్తపు సీసాలు, ఇన్ని సెలైన్ సీసాలెక్కిస్తున్నా ఇంకా తిరికి యధాస్థితికి రాలేని ఆ పేషెంట్ మందులన్నీ మానేసిన ఓ గంట తర్వాత తిరిగివస్తే రావచ్చుగాని అది ఆమె మృత శరీరం మాత్రమే అయుంటుంది.

నిజాలకి ఇరవయ్ నాలుగు గంటలుగా దొరకని విశ్రాంతి నా శీరానికిపుడు దొరికింది.

కానీ నా మనసుకు మరింత అశాంతి.

మానవులు సృష్టించుకున్న ఓ కంచు విగ్రహమా! ఓ దేవతా ఊహా చిత్రమా! నీ ఉనికిమీద వీళ్ళకు నమ్మకం లేకపోతే నిన్న, మొన్న, ఈరోజు, రేపు ఇలా ఎందరో అర్థాంతరంగా జీవితాల్ని పరిసమాప్తం చేసుకునేవాళ్ళు కాదు.

నా కళ్ళు వాలిపోతున్నాయి-శరీర శ్రమతో కొంత, మానసిక అశాంతితో మరికొంత.

*